క్లుప్తంగా

వీడియో, ఫొటోగ్రాఫర్ల కొవ్వొత్తుల ర్యాలీ



తెనాలిఅర్బన్: మధురవాడకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయికుమార్‌ను హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని తెనాలి వీడియోగ్రాఫర్స్ అండ్ ఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సాయికుమార్ హత్యను నిరసిస్తూ పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సాయికుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఇలాంటి దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు.

శుక్రవారాన్ని డ్రైడేగా పాటించండి



తెనాలిఅర్బన్: అందరూ శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని మలేరియా తెనాలి పట్టణ సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్ కోరారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో బీసీ కాలనీలో శుక్రవారం దోమల నియంత్రణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాల్లో ఉన్న నీళ్ల క్యాన్‌లు, తొట్టెలను శుభ్రం చేయాలని కోరారు. ఇవన్నీ దోమల ఉత్పత్తికి కారకాలని వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



తెనాలి: మహిళల ఆర్థిక స్వావలంబనే దేశ ప్రగతిగా భారతీయ స్టేట్‌బ్యాంక్ ప్రాంతీయ అధికారి నోరి ప్రసాద్ చెప్పారు. మహిళాభ్యున్నతిలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా వెలుగొందుతోందని అభిప్రాయపడ్డారు. స్థానిక బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జేఎంజే మహిళా కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైనీని సత్కరించారు. భారతీయ స్టేట్‌బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా తాడిశెట్టి పూజిత, షేక్ రజియా, సాదికలకు కుట్టుమిషన్లను అందజేశారు. చీఫ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, హెచ్ఆర్ మేనేజర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

శ్మశానంలో బోరు ఏర్పాటు

గుంటూరు రూరల్: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రూరల్ మండలం ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం తురకపాలెం గ్రామం బీసీ కాలనీ వాసుల శ్మశాన వాటికలో రూ.2 లక్షలతో బోరు ఏర్పాటుకు ఎంపీపీ శంకుస్థాపన చేశారు. ఇప్పటికే శ్మశాన వాటికకు ప్రహరీ ఏర్పాటు చేశామని, గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని ఎంపీపీ తెలిపారు. గ్రామ సర్పంచ్ డబ్బూరి సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పెదకాకానిలో వైఎస్సార్ విగ్రహావిష్కరణ

పెదకాకాని: మండల కేంద్రంలో శనివారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 5 కోట్ల ఎంపీ నిధులతో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు.

ముస్లింలకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి జగన్

తాడేపల్లి రూరల్: రాష్ట్రంలో ముస్లింలకు ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి న్యాయం చేశారని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. వైఎస్సార్ సీపీ ఏడు అసెంబ్లీ సీట్లు కేటాయిస్తే టీడీపీ ఒక్కరికి మాత్రమే సీటు ఇవ్వడం ముస్లింపై వారికున్న చిత్తశుద్ధి వ్యక్తమవుతోందని తెలిపారు. చంద్రబాబునాయుడు ముస్లింలపై కపట ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. రంజాన్ తోఫా ఇవ్వడం లేదని విమర్శలు గుప్పిస్తున్న టీడీపీ నేతలు ఏడాది ఒక్కసారి ఇచ్చే రూ. 200 సరుకులతో ముస్లింల జీవితాల్లో ఏ విధంగా అభివృద్ధి సాధ్యమవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ముస్లింలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, రాజకీయంగా సముచిత స్థానం కల్పించారని తెలిపారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

- ఉదయం నుంచి ఆలయాల్లో పూజలు చేసిన భక్తులు
- సంగమేశ్వరస్వామికి పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే శివకుమార్



సంగంజాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిటౌన్: మహాశివరాత్రిని పురస్కరించుకుని పట్టణ, రూరల్ గ్రామాల్లోని శివాలయాలు శుక్రవారం శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నుంచి భక్తులు ఆలయాల్లో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. రూరల్ మండలం సంగం జాగర్లమూడిలోని సంగమేశ్వరస్వామి దేవస్థానంలో సంగమేశ్వరస్వామికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎం.హరిప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు కె.హరీష్, పి.రమణ, పి.అశోక్‌యాదవ్, జి.వేణు గోపాలరెడ్డి పాల్గొన్నారు.

- గంగానమ్మపేటలోని రామమేశ్వస్వామి ఆలయం(పాత శివాలయం)లో మహా శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పూజల్లో పాల్గొన్నారు.
- పట్టణంలోని ఆర్యవైశ్య అపరకర్మశాలలో మహాశివరాత్రి సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. శివుని విగ్రహం వద్ద విశేష పూజలు జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ హరిప్రసాద్, ఆర్యవైశ్య నాయకులు మద్దాలి శేషాచలం, పొన్నూరు శ్యామలరావు, ఆర్యవైశ్య సంఘ ప్రెసిడెంట్ అచ్యుత సాంబశివరావు, గ్రంథి చంద్రమౌళేశ్వరరావు, ఎం.రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, రామకోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెసర్లంక రమణ, కఠారి హరీష్ పాల్గొన్నారు.
- మారీసుపేటలోని కోదండరామస్వామి దేవస్థానం(అప్పలస్వామి) గుడిలో మహాశివరాత్రి సందర్భంగా శివాకృతిలో చేసిన శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం ప్రదోష సమయంలో లక్ష్మీగణపతి, నవగ్రహ, మృత్యుంజయ, రుద్ర హోమం చేశారు. స్వామివారికి ఏకాభి షేక్ రుద్రాభిషేకం నిర్వహించారు.
- మారీసుపేటలోని శివాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు భక్తులకు హారతులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గ్రంథిసేతు మాధవరావు, కార్యదర్శి పొన్నూరు నాగ సూర్యశశిధరరావు, వరద వెంకట శేషగిరిరావు, తాడిపర్తి హరిప్రసాద్, తాడిపర్తి హరిప్రసాద్, అంకమ్మరాజు, ఆలయ ప్రధాన అర్చకుడు నాగఫణిశర్మ, భక్తులు పాల్గొన్నారు.



అప్పలస్వామి గుడిలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

- గంగానమ్మపేటలోని రామేశ్వరస్వామి ఆలయం, చినరావూరులోని శ్రీ బాలత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకం జరిపారు. శివరాత్రిని పురస్కరించుకుని ఆలయాలను రంగురంగులతో విద్యుత్ అలంకరణలతో ముస్తాబ్ చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి హరిబాబు, ప్రధాన అర్చకులు ఈశ్వర్, భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.
- రూరల్ మండలం కొలకలూరులోని అగస్త్యేశ్వర స్వామి ఆలయం, ఖాజీపేటలోని శివాలయం, నందివెలుగులోని అగస్త్యేశ్వరస్వామి ఆలయం, పలు గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు.

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణం14వ వార్డు పరిధిలోని ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు శుక్రవారం సచివాలయం వద్ద రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దాసరి వీరవసంతరావు, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ తెనాలి పట్టణ క్లస్టర్-1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం, వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లా గురునాథగుప్తా, వార్డు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వసంతరావు, శేషాచలం

31వ వార్డులో...

తెనాలిఅర్బన్: తెనాలి నియోజకవర్గంలో 27 వేల ఇళ్ళ స్థలాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనని 31వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ గోగిరెడ్డి మానసారెడ్డి పేర్కొన్నారు. 31వ వార్డు పరిధిలోని సచివాలయంలో శుక్రవారం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రావి శ్రీనివాసరావు, రాయల్ ప్రతాప్, కృష్ణ, మోహన్‌రావు, మరియమ్మ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ మానసరెడ్డి

మల్లెపాడులో ఎన్నికల ప్రచారం

తెనాలిటౌన్: రూరల్ మండలం మల్లెపాడు గ్రామంలో మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి పినపాటి భారతీదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, మాజీ ఎంపీటీసీ నిరంజన్, పారీట నాయకులు గంగయ్య, అనిల్‌కుమార్, యోహాన్, సీయోను, ప్రసాద్ పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేసి మహిళతో మాట్లాడుతున్న సత్యనారాయణ

క్రైస్తవులపై దాడులను అరికట్టాలి

ఏపీ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జాన్‌బాబు

తెనాలిటౌన్: భారతదేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో మతోన్మాదులు క్రైస్తవులపై దాడుల చేస్తున్నారని ఆ దాడులను అరికట్టాలని ఏపీ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ మద్రిపూడి జాన్‌బాబు కోరారు. రూరల్ మండలం కఠెవరంలో చర్చి వద్ద శుక్రవారం ఆర్గనైజేషన్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆర్గనైజేషన్ అధ్యక్షుడు జాన్‌బాబు మాట్లాడుతూ ఇటీవల తెలంగాణ జనవాడలో అగ్రకులస్తులు దళిత క్రైస్తవులపై దాడుల చేసి రాళ్ళురువ్వి అద్దాలు పగలుకొట్టిన ఘటన సంచలనం సృష్టించదన్నారు. సమావేశంలో ఆర్గనైజేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రదర్ ఆనంద్‌కుమార్, సెక్రటరీ పాస్టర్ అబ్రహం, జాయింట్ సెక్రటరీ పాస్టర్ శ్యామ్‌సన్, కోశాధికారి పాస్టర్ రమేష్, పాస్టర్లు చిట్టిబాబు, జక్రయ్య పాల్గొన్నారు.



కఠెవరంలో చర్చి వద్ద మాట్లాడుతున్న ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జాన్‌బాబు

ఆకట్టుకున్న నృత్య నీరాజనం



నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పాత గుంటూరు: మహా శివరాత్రి సందర్భంగా బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ శివపాద మంజీరనాదం పేరుతో 'శివరాత్రి నృత్య జాగరణ' వైభవంగా నిర్వహించింది. కార్యక్రమాన్ని బొల్లేపల్లి సత్యనారాయణ, సీహెచ్. మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కళాకారులు శుక్రవారం రాత్రి 7 గంటలకు ప్రారంభించి శనివారం ఉదయం 6 గంటల వరకు నృత్య ప్రదర్శనలు చేశారు. సంస్థ అధ్యక్షులు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు స్వాగతం పలికారు. సుమారు వంద మంది నర్తకులు పదకొండు గంటల పాటు చేసిన నృత్య నీరాజనం సాగింది. పాల్గొన్న వారందరికీ నంది ప్రతిమల్ని నిర్వాహకులు బహుమతిగా అందించారు. నాట్యాచార్య డాక్టర్ కాజ వేంకట సుబ్రహ్మణ్యం, నాట్యాచార్య బాలు, నాట్యాచారిణి నల్లపాటి సుశీల, నాట్యాచారిణి సాయిమంజీర శిష్యులు వివిధ కీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి భక్తుల్ని ఆకట్టుకున్నారు. కార్యక్రమాన్ని నాగలక్ష్మి పర్యవేక్షించారు.

ఘనంగా మహిళా దినోత్సవం

తెనాలిటౌన్: సేవా రంగంలో మహిళల పాత్ర ఎంతో విలువైనదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి పేర్కొన్నారు. పట్టణంలో పార్టీ కార్యాలయంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. సభకు పార్టీ పట్టణ అధ్యక్షుడు అడపా సంపత్‌రాయుడు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు ఆకుల భవానీ, దానమ్మ, దుర్గాప్రశాంతి, సుబ్బయ్యమ్మలను సత్కరించి, నూతన వస్త్రాలు బహూకరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సంపత్‌రాయుడు, నాయకులు బిట్రా కనకదుర్గ, దారా సాయిగుప్తా, శిఖా రవీంధ్ర, టి.వెంకటేశ్వరరావు, డి.వీరయ్య, కుశల్‌రాజ్‌జైన్, అడుసుమల్లి సుధాకర్, తన్నీరు శివశంకర్ పాల్గొన్నారు.

- మారీసుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో సీఐటీయూ, ఐద్వా కమిటీల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలను జరిపారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ ఏవీఎస్ కుమారి అధ్యక్షతన నిర్వహించిన సభలో సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ మాట్లాడుతూ జనాభాలో 50శాతం ఉన్న మహిళలు అణిచివేతకు, దోపిడికి గురవతున్నారన్నారు. మహిళా సాధికారత కోసం, ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లావణ్య, హసీనాబేగం, సునీత, కనకదుర్గ, పుష్ప, రాజ్యలక్ష్మి, సువర్ణ, చంద్రకళ, శివలక్ష్మి, సీఐటీయు నాయకులు హుస్సేన్ వలీ, జోనేష్, వెంకటసుబ్బయ్య, రవికుమార్, శివకృష్ణ, సాంబశివరావు, శ్రీనివాసరావు, నారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.
- చెంచుపేటలో సెంటర్‌ఫర్ ఉమెన్స్ నెట్‌వర్క్ కార్యాలయంలో మహిళా దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా నెట్‌వర్క్ డైరెక్టర్ బచ్చలకూర జ్యోతిర్మయి మాట్లాడుతూ వివిధ రంగాల్లో పురుషులు కంటే మహిళలు సాధించిన విజయాలను తెలిపారు. మహిళలను ప్రోత్సాహించాలని కోరారు. ఆడపిల్లలను చదివించాలని, దేశ నిర్మాణానికి దోహదపడే ఉజ్వల భవిష్యత్‌ను వారికి అందించాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికల సమగ్ర అభివృద్ధికి అనుగుణంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. మహిళలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నెట్‌వర్క్ ప్రధాన కార్యదర్శి డి.శిరీష, ఎగ్జిక్యూటివ్ మెంటర్ డి.శోభారాణి, కోశాధికారి ఎం.సునీత, ప్రవీణ్ పాల్గొన్నారు.



పారిశుద్ధ్య కార్మికులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు స్వరూపరాణి, సంపత్‌రాయుడు

వృద్ధాశ్రమంలో...

తెనాలి: పట్టణ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత ఆధ్వర్యంలో తెనాలి రూరల్ మండల గ్రామం నందివెలుగులోని దయానంద వృద్ధాశ్రమంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా ఆశ్రమ కమిటీ బాధ్యులు కూరపాటి రవీంద్ర, కళ్యాణి ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు డాక్టర్ కొలసాని రామ్‌చంద్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాసబాబు, ఉపాధ్యక్షుడు ఓంకార్ ప్రసాద్, కోశాధికారి పి.వెంకట్, శాంతి షుమార్ట్ సాంబశివరావు, ఎ.కృష్ణకుమార్, కె.మదన్‌మోహన్, కె.నివేదిత పాల్గొన్నారు.

ఎస్‌టీయూ ఆధ్వర్యంలో..

తెనాలి: ఎస్‌టీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ఏర్పాటైన వేడుకకు డీ3 శారద సర్వీస్‌సొసైటీ వ్యవస్థాపకురాలు డాక్టర్ శారద, వేమూరు, కొల్లిపర మండలాల విద్యాశాఖ అధికారులు రోజ్‌లాండ్, ఝాన్సీలత హాజరయ్యారు. సభకు ఎస్‌టీయూ రూరల్ మండల బాధ్యురాలు గోవిందమ్మ అధ్యక్షత వహించారు. దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, నందివెలుగు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయినులు శోభాదేవి, శివపార్వతి, ఎస్‌టీయూ నాయకుడు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యాయులు కేఏకే జిలాని, జిల్లా గౌరవాధ్యక్షుడు ఏవీ ప్రసాద్‌బాబు, తెనాలి ఏరియా కార్యదర్శి డీవీ సుబ్బారావు, వేమూరు ఏరియా కార్యదర్శి ఎం.శ్రీధర్, సీనియర్ నాయకులు కె.బెనహర్‌బాబు, ఈ.అంబరీషుడు, తెనాలి రూరల్, అర్బన్, దుగ్గిరాల, కొల్లిపర, కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు జిల్లా బాధ్యులు మొత్తం 130 మంది పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయినులను మహిళా దినోత్సవ పురస్కారంతో సత్కరించారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

ఓవర్ లోడ్‌తో గ్రామాల్లో రోడ్లు ధ్వంసం



తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండలంలోని గొడవర్రు చుట్టుపక్కలున్న ఇసుక రీచ్‌ల నుంచి లోడు లారీలు టోల్ ప్లాజా ఫీజు కట్టకుండా గ్రామాల్లోని చిన్న చిన్న రహదారుల్లో నుంచి గుంటూరు నగరానికి వెళ్లడంతో పలుచోట్ల బీటీ రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. పండగ అని కూడా చూడకుండా శుక్రవారం చిలువూరుకు చెందిన యువకులు, గ్రామ పెద్దలు లారీల్ని అడ్డుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టోల్ ప్లాజా ఫీజు చెల్లించకుండా వెళ్లేందుకు లారీ డ్రైవర్లు 40 నుండి 50 టన్నుల బరువుతో అతివేగంగా వెళ్లడంతో చిలువూరు, నంబూరు రోడ్‌లో వెళ్లడం వల్ల రహదారులు పూర్తిగా ధ్వంసం అయ్యాయని తెలిపారు. లారీలు వచ్చే సమయంలో ద్విచక్ర వాహనదారులు, ఇతర వాహనదారులు భయభ్రాంతులకు గురవుతున్నారని చెప్పారు. లారీ వస్తుంటే అది వెళ్లేంత వరకు వాహనాలు రోడ్డు పక్కకు తీసి ఆపాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు ఓవర్‌లోడ్‌తో తిరిగే లారీలను అడ్డుకోవాలని, నిర్ణయించిన రహదారిలో గుంటూరు వెళ్లేవిధంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో గ్రామంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని చిలువూరు గ్రామస్తులు తెలియజేశారు.

ముగిసిన సేవా పథకం శిబిరం

తెనాలిఅర్బన్: జేఎంజే కళాశాల ఆధ్వర్యంలో చావావారిపాలెం గ్రామంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరం శుక్రవారం ముగిసింది. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రామంలోని రోడ్లు, కాల్వలను శుభ్రం చేయడంతో పాటు వివిధ ప్రాంతాల్లో మొక్కలను నాటారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో 28వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ యాతాటి అనిల్, ఘంటా కిరణ్, ఫిలిప్, బెజిమెన్, అధ్యాపకులు డాక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

తెనాలిఅర్బన్: మహా శివరాత్రిని పురస్కరించుకుని శివాజీచౌక్‌లోని కాశీమాత ఆలయం వద్ద శుక్రవారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుమ్మడి రమేష్, కార్యదర్శి వై.శ్రీనివాసరావు, సభ్యులు మేక సురేష్, కందేపు సీతారామయ్య, నీరంజన్, మెడికల్ సుబ్బారావు, అడపాల శ్రీనివాసరావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

పరీక్షల కిట్ల పంపిణీ

గుంటూరు మెడికల్: చైత్ర ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మహిళా శిశు ప్రాంగణంలోని ఏపీ గిరిజన సంక్షేమ బాలికల వసతి గృహంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థినులకు పరీక్షల కిట్లను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితంలో తొలి మెట్టు పదో తరగతి పరీక్షలని, మంచి మార్కులు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఏఎస్ ఫోకస్ అకాడమి డైరెక్టర్ కోటేశ్వరరావు, చైత్ర ట్రస్టు డైరెక్టర్ రవి దంపతులు, హాస్టల్ వెల్ఫేర్ అధికారి హిమశిల్ప పాల్గొన్నారు.

జీజీహెచ్ న్యూరాలజీ విభాగానికి స్మార్ట్ టీవీ బహూకరణ

ఆర్‌కే స్కాన్ అధినేత డాక్టర్ రమణకుమార్ రూ. 3 లక్షలు ఖరీదు చేసే స్మార్ట్ టీవీని న్యూరాలజీ వైద్య విభాగానికి బహూకరించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, మచిలీపట్నం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉప్పుటూరి అరుణకుమారి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గొట్టిపాటి బిందునర్మద, పలువురు పీజీ వైద్యులు పాల్గొన్నారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



పేరకలపూడిలో కవాతు నిర్వహిస్తున్న ఎస్ఐ మహేంద్ర తదితరులు

తాడేపల్లి రూరల్: త్వరలో నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరుతూ దుగ్గిరాల పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పలు గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్ ఆదేశాల మేరకు ఎన్నికలు, ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తూ ప్రతి ప్రాంతంలో కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతలపూడి, ఈమని, పేరకలపూడి గ్రామాల్లో స్థానిక సిబ్బందితో పాటు సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కలసి కవాతు నిర్వహించామని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, దుగ్గిరాల పోలీస్‌స్టేషన్ సిబ్బంది ప్రసాద్, సురేష్, శివాజీ, హెడ్ కానిస్టేబుల్ హసీన్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

తాడికొండ: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పనిచేస్తున్న పోలీసు శాఖకు ప్రజలు సహకారం అందించాలని తుళ్లూరు డీఎస్పీ అశోక్ కుమార్ గౌడ్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో రాజధాని ప్రాంతమైన మందడం, మల్కాపురం, వెలగపూడి గ్రామాల్లో శుక్రవారం కేంద్ర బలగాలతో మార్చ్‌ఫాస్ట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాలలో ప్రత్యేక పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు సుభాని, అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

తాడికొండ: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన బండారుపల్లి రైల్వే ట్రాక్‌పై 12వ కిలోమీటరు వద్ద జరిగింది. రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి మార్చురీకి తరలించినట్లు రైల్వే జీఆర్పీ ఎస్ఐ శ్రీనివాసరావునాయక్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు నడికుడి జీఆర్పీ పోలీసుల్ని సంప్రదించాలని ఆయన సూచించారు.